AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAY.IN
4-5-2026 (Monday) MAIN EDITION

## గణనీయంగా పెరిగిన టీవీఎస్ ఈవీ సేల్స్



**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** టీవీఎస్ మోటార్ మొత్తం అమ్మకాలు గతేడాది ఏప్రిల్ తో పోలిస్తే ఈ ఏప్రిల్‌లో 7 శాతం పెరిగి 4.73 లక్షల యూనిట్లుగా నమోద య్యాయి. గతేడాది ఇదే నెలలో అమ్మిన 4.43 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. ఈ వృద్ధి ప్రధానంగా ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) విక్రయాల కారణంగా వచ్చింది. ఈవీల అమ్మకాలు 36 శాతం (37,771 యూనిట్లు) పెరగడం గమనార్హం. టీవీఎస్ మోటార్ కంపెనీ త్రీ వీలర్ వాహనాల అమ్మకాలూ గణనీయంగా పెరిగాయి. 37 శాతం వృద్ధితో 18,637 యూనిట్లు అమ్ముడయ్యాయి.

## 18న హైదరాబాద్‌కు 8వ పే కమిషన్ బృందం




**అక్షరటుడే, హైదరాబాద్:** ఎనిమిదో వేతన సవరణ కోసం ఏర్పాటు చేసిన కమిషన్ బృందం సభ్యులు ఈనెల 18, 19 తేదీలలో హైదరాబాద్‌లో పర్యటించి, ఉద్యోగుల అభి ప్రాయాలు సేకరించనున్నారు. వేతనాల పెంపు, అలవెన్సులు, పెన్షన్ల సవరణ తది తర అంశాలపై క్షేత్రస్థాయిలో అభిప్రాయాలను సేకరించేం దుకు జస్టిస్ రంజన ప్రకాష్ దేశాయ్ నేతృత్వంలోని బృందం రాష్ట్రాలలో పర్యటిస్తోంది. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, పెన్షనర్లతో మాట్లాడి వారి సమస్యలను రికార్డు చేయనున్నారు. వేతన సవరణపై వారి అభిప్రాయాలను తెలుసుకుంటారు.

## కేరళం ప్రజలకు రేవంత్ ధన్యవాదాలు



అక్షరటుడే, నేషనల్ డెస్క్: కేరళం కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి విజయం సాధించింది. దీనిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ గెలుపునకు కృషి చేసిన పార్టీ శ్రేణులపై ప్రశంసలు కురిపించారు. అలాగే అగ్రనేతలు రాహుల్ గాంధీ, ఖర్గే, ప్రియాంకలకు శుభాకాంక్షలు తెలిపారు.

## డిగ్రీ అర్హతతో కేంద్ర ప్రభుత్వ కొలువు



అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్: స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ పలు ఉద్యోగాల భర్తీ కోసం చర్యలు చేపట్టింది. వివిధ శాఖలలో హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టుల భర్తీ కోసం ఎస్సెస్సీ కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్స్ ఎగ్జామినేష్ 2026 నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 84 పోస్టులను భర్తీ చేయనుంది.

## సీఎం స్టాలిన్ ఓటమి



అక్షరటుడే, నేషనల్ డెస్క్: తమిళనాడులో టీవీకే తుఫాన్‌లో అధికారం కోల్పోయిన డీఎంకేకు మరో షాక్ తగి లింది. పార్టీ అధినేత, సీఎం స్టాలిన్ ఓడిపోయారు. కొలత్తూరు నియోజకవర్గం ఎంకే స్టాలిన్ పోటీ చేయగా ఆయనపై టీవీకే అభ్యర్థి అయిన వీఎస్.బాబు గెలుపొందారు.



దేశవ్యాప్తంగా ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్న నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం అసెంబ్లీ ఎన్నికల ఫలి తాలు వెలువడ్డాయి. మూడు రాష్ట్రాల్లో బీజేపీ పాగా వేసింది. ప్రధానమైన పశ్చిమ బెంగాల్‌లో కమలం వికసించింది. 15 ఏళ్ల మమత పాలనకు చరమగీతం పాడుతూ బీజేపీ అధికారాన్ని దక్కించుకుంది. అస్సాంలో బీజేపీ హ్యాట్రిక్ కొట్టింది. అలాగే పుదుచ్చేరిలో ఎన్డీఏ అధికారాన్ని కాపాడుకుంది. ఇక తమిళనాడు ఫలితాల్లో సంచలనం జరిగింది. టీవీకే సత్తా చాటింది. పార్టీ స్థాపించిన రెండేళ్లకే విజయ్ అధికారం చేజిక్కునే దిశగా ఫలితాలు సాధించారు. ఇక కేరళంలో యూడీఎఫ్ కూటమి విజయం దిశగా దూసుకెళ్తోంది.

–అక్షరటుడే, నేషనల్‌డెస్క్



# బెంగాల్‌లో బీజేపీ
# తమిళనాడులో టీవీకే

■ అస్సాంలో కమలం హ్యాట్రిక్ విజయం ■ కేరళంలో కాంగ్రెస్ జోరు ■ పుదుచ్చేరిలో ఎన్డీఏ విజయం

పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు ఇటీవల జరిగిన విషయం తెలిసిందే. వాటి ఫలితాల కోసం ప్రజలు ఎంతో ఉత్కంఠతో ఎదురు చూశారు. ఈ ఎన్నికల్లో బెంగాల్‌లో మమత బెనర్జీకి ఓటర్లు షాక్ ఇచ్చారు. బీజేపీకి పట్టం కట్టా రు. మొత్తం 293 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. బీజేపీ 190కి పైగా స్థానా ల్లో బీజేపీ స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. ఇక్కడ మ్యాజిక్ ఫిగర్ 148 కాగా.. బీజేపీ సీఎం కుర్చీని దక్కిం చుకోనుంది. టీఎం సీ 95, కాంగ్రెస్ 1, కమ్యూనిస్టులు రెండో చోట్ల ఆధి క్యంలో ఉన్నారు. ఇక మమత బెనర్జీ భవానీపూర్‌లో లీడింగ్‌లో ఉండగా.. సువేంద్ అధికారి నందిగ్రామ్‌లో గెలుపు దిశగా సాగుతున్నారు. పార్టీ గెలుపుతో శ్రేణులు సంబరాల్లో మునిగి తేలుతున్నాయి.

తమిళనాడులో అనుహ్య ఫలితాలు వచ్చాయి. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ విజయ్ టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించింది. డీఎంకే, అన్నా డీఎంకేలకు షాక్ ఇస్తూ ప్రజలు సినీ నటుడు విజయ్ స్థాపించిన టీవీకేకు పట్టం కట్టారు. తమిళనాడులో మొత్తం 234 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. టీవీకే 108కు పైగా స్థానాల్లో లీడింగ్‌లో ఉంది. డీఎంకే 65, ఏఐడీఎంకే 61 చోట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నాయి. విజయ్ మెజారిటీకి దగ్గరలో ఆగిపోయారు. ఇతర పార్టీల మద్దతుతో ఆయన సీఎం అయ్యే అవకాశాలు ఉన్నాయి. టీవీకే లీడింగ్‌లో ఉండటంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు. కాంగ్రెస్‌తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని విజయ్ తండ్రి తెలిపారు.

### యూడీఎఫ్ హవా



కేరళంలో కాంగ్రెస్ విజయం సాధించింది. 140 అసెంబ్లీ స్థానాలు ఉండగా కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి విజయం సాధించింది. ఆ కూటమి అభ్యర్థులు 100కు పైగా స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఎల్‌డీఎఫ్ 34 స్థానాల్లో, బీజేపీ రెండు చోట్ల లీడ్‌లో ఉన్నాయి. తాజా విజయంతో కాంగ్రెస్ ఖాతాలో మరో రాష్ట్రం చేరింది. ప్రస్తుతం ఆ పార్టీ హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలో అధికారంలో ఉంది. తాజాగా కేరళంలో విజయవబావుట ఎగుర వేసింది. మిగతా రాష్ట్రాల్లో ప్రభావం చూపని హస్తం పార్టీ కేరళంలో మాత్రం జోరు కొనసాగించడం గమనార్హం. మరోవైపు కమ్యూనిస్టులు అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం కేరళంను కూడా కోల్పోయారు. దీంతో ప్రస్తుతం లెఫ్ట్ పార్టీలు దేశంలో ఎక్కడ కూడా అధికారంలో లేవు.

### అస్సాంలో..



అస్సాంలో బీజేపీ హ్యాట్రిక్ కొట్టింది. మొత్తం 126 స్థానాలకు ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఇక్కడ మ్యాజిక్ ఫిగర్ 64 కాగా.. బీజేపీ 99కి పైగా స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. కాంగ్రెస్ 23 స్థానాల్లో లీడ్‌లో ఉంది. హిమంత బిస్వా శర్మ రెండోసారి సీఎం కానున్నారు. బీజేపీ ఇక్కడ 2016 నుంచి అధికారంలో ఉంది. ఇప్పుడు హ్యాట్రిక్ కొట్టనుంది. 2016 నుంచి 2021 వరకు సర్బనంద సోనోవాల బీజేపీ తొలి సీఎంగా పనిచేశారు. అనంతరం 2021లో హిమంత సీఎం అయ్యారు. ఫలితాల్లో ఆ పార్టీ దూసు కుపోతుండడంతో రెండో సారి ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నారు.

### పుదుచ్చేరిలో..



పుదుచ్చేరిలో మరోసారి ఎన్డీఏ గెలుపొందింది. 18కిపైగా స్థానాల్లో ఆ కూటమి ఆధిక్యంలో ఉంది. డీఎంకే 7, టీవీకే ఒక చోట, ఇతరులు 4 చోట్ల లీడ్ లో ఉన్నారు. సీఎం రంగస్వామి 4వేలకు పైగా ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మొత్తంగా మూడు రాష్ట్రాల్లో అధికారం మారగా.. అస్సాం, పుదుచ్చేరిలో బీజేపీ అధికారాన్ని కాపాడుకుంది. ఈ ఫలితాలతో బీజేపీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. కేరళంలో సత్తా చాటడంతో కాంగ్రెస్ సైతం ఖుషీగా ఉంది. టీఎంసీ, డీఎంకే కార్యకర్తలు నిరాశలో ఉన్నారు.



## అన్ని రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ సర్కార్లే: బండి సంజయ్

**అక్షరటుడే, కరీంనగర్:** రాబోయే రోజుల్లో దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ మోదీ నాయకత్వంలో డబుల్ ఇంజిన్ సర్కార్లు రాబోతున్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఉత్తరాది, దక్షి ణాది అంటూ విభజన రాజకీయాలు చేసేందుకు ప్రయత్నించిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, తమిళనాడు సీఎం స్టా లిన్‌కు ఈ ఫలితాలు చెంపపెట్టులాంటివ ని వ్యాఖ్యానించారు. కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెల్లరీలో జరిగిన కాల్పుల ఘటనలో గాయపడి చికిత్స పొందుతు న్న బాధితులను బండి సంజయ్ పరామ ర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బాధిత కు టుంబాలకు ధైర్యం చెప్పాల్సింది పోయి.. ఘటనను రాజకీయ కోణంలో చూస్తు న్నారని విమర్శించారు. దుకాణం యాజ మాన్యంతో మాట్లాడానని, బాధితులకు అండగా నిలవాలని కోరానని చెప్పారు.

## కుప్పకూలిన సన్ టీవీ షేర్లు..

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అనూహ్యం గా సినీ హీరో సీ జోసెఫ్ విజయ్ నేతృ త్వంలోని టీవీకే(తమిళగ వెట్రి కళగం) పార్టీ అధికారం దిశగా దూసుకెళ్తోంది. విజయ్ ప్రభంజనంతో డీఎంకే అధికారా నికి దూరమయ్యింది. ఈ క్రమంలో ప్రముఖ టెలివిజన్ సంస్థ సన్ టీవీ నెట్‌వ ర్క్ షేర్లు కుప్పకూలాయి. ఇంట్రాడేలో 10 శాతం పడిపోయి రూ. 547.55 వద్ద లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. ఆ తర్వాత కాస్త కోలుకున్నాయి. సన్ గ్రూప్ నకు చెందిన సన్ టీవీ నెట్ వర్క్ తమిళ నాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కరుణాని ధి మనవడు, ప్రస్తుత సీఎం ఎంకే స్టాలిన్ మేనల్లుడు అయిన కళానిధి మారన్‌కు చెందినది.

## మా కెమెరాలు, ఫోన్లు హ్యాక్ చేస్తున్నారు: కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్:** బెంగళూరు నుంచి హ్యాకర్లను తెచ్చి తమ సీసీ కెమెరాలు, ఫోన్లు హ్యాక్ చేయిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పోలీసులు ముఖ్యమంత్రి ప్రైవేట్ ఆర్మీ లాగా పని చేస్తున్నా రని ఆరోపించారు. సంగారెడ్డి జైలులో ఉన్న బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్‌ను సోమవారం ఉదయం కేటీఆర్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మా ట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ దోపిడీని బయటకు తెచ్చిన మన్నె క్రిశాంక్ గొంతు నొక్కేందుకు అక్రమ కేసులు పెట్టా రన్నారు. ప్రభుత్వ అవినీతిని, అక్రమాలను బయట పెట్టినందుకు 35 కేసులు పెట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా మీద, బీఆర్ఎస్ నాయ కుల మీద రేవంత్ రెడ్డి పెట్టిన శ్రద్ధలో ఒక పైసా భాగం అయినా రాష్ట్రంలో జరుగుతున్న శాంతి భద్రతలపై పెట్టాలని కేటీఆర్ కోరారు. రేవంత్ రెడ్డి ఇంతకు ఇంతా చెల్లించుకుంటారని, ఇవ్వన్నీ బంద్ చేసి పాలన మీద దృష్టి పెట్టాలని హితవు పలికారు. కరీంనగర్‌లో ఉదయం జ్యువెల్లరి షాప్‌లో కాల్పులు జరిగాయన్నారు. వీటి గురించి పట్టించుకోని సీఎం, సోషల్ మీడియాలో ఎవరు ఏం పోస్టులు పెడుతున్నారని ఆరా తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హామీలపై పోరాటం చేస్తూనే ఉంటామన్నారు.

## మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



**అక్షరటుడే, హైదరాబాద్:** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం లోని కనుగుట్టలో ప్రమాదవ శాత్తు వంద ఎకరాలకు పైగా మొక్కజొన్న పంట దహనం అవడంపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వ కుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. పంట దహనమై నష్టపోయిన రైతులతో హైదరాబాద్ నుంచి కవిత ఫోన్‌లో మాట్లాడి ఓదార్చారు. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, టీఆర్ఎస్ నాయకులు బానోత్ మౌనికతో కలిసి బాధిత రైతులతో మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులు ధైర్యంగా ఉండాలని.. పంట నష్టం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేలా ఒత్తిడి చేస్తామని ధైర్యం చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మొక్కజొన్న పంట దహనమై నష్టపో యిన రైతులకు తక్షణ సాయం అందించాలని, పంటనష్టం అంచనా వేసి నష్టపరిహా రం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## జమ్మూ కశ్మీర్ సీఎం పోస్ట్ వైరల్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. ఫలి తాల సరళిపై జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దు ల్లా సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. ఓవైపు ఓట్ల లెక్కింపు కొనసాగుతుండగానే జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా తన 'ఎక్స్' ఖాతాలో పెట్టి న పోస్ట్ సెన్సేషన్‌గా మారింది. ఎన్నికల ఫలితాల సరళిని చూసి ఆశ్చర్యపోయిన ఆయన 'బ్లడీ హెల్' అంటూ షాకింగ్ రియాక్షన్ ఇచ్చారు. దీనికి షాక్ అయ్యే ఎమోజీలను కూడా జోడించారు. ఏదైనా ఊహాతీత సంఘటన జరిగినప్పుడు బ్లడీ హెల్ అనే పదాలను వాడుతుంటారు. పశ్చిమబెంగా ల్, తమిళనాడు ఎన్నికల ఫలితాల సమయంలో ఆయన ఈ పదబంధాన్ని ప్రయో గించడం గమనార్హం. తర్వాత మొదటి పోస్ట్‌కు కొనసాగింపుగా మరో పోస్ట్ పెట్టారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ భారీ ఆధిక్యతను, తమిళనాడులో విజయ్ పార్టీ ప్రభావాన్ని గురించి ప్రస్తావిస్తూ రాజకీయ భూకంపంగా అభివర్ణించారు. ఈ వ్యా ఖ్యలు వైరల్‌గా మారాయి.